అభిమానుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేజీఎఫ్ ఫేం యశ్ ముగ్గురు అభిమానుల కుటుంబీకులకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. యశ్ పుట్టిన రోజు సందర్భంగా బ్యానర్లు కడుతూ విద్యుత్ షాతో ముగ్గురు అభిమానులు మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం గదగ్ జిల్లా సూరణగి గ్రామానికి చేరుకున్న యశ్ ప్రతి అభిమాని కుటుంబానికి రూ.5 లక్షల విలువైన చెక్కును అందించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ సంఘటన బాధాకరమని, అభిమానుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన రోజునే వారి కుటుంబాలను పరామర్శించిన విషయం తెలిసిందే.

కులమతాలను వీడి...

రాయణ్ణ దేశభక్తిని పాటిద్దాం

- ఆయన నేటి యువతరానికి ఆదర్శం
- బెళగావిలో క్రాంతివీర ఉత్సవాల ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కులమతాలను వీడి దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన సంగొళ్లి రాయణ్ణ దేశభక్తిని పాటిద్దామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. బెళగావి జిల్లా యంత్రాంగం, కన్నడ సంస్కృతి శాఖ సంయుక్తంగా బైలహొంగల తాలూకా సంగొళ్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ ఉత్సవాలను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. రాయణ్ణ స్వగ్రామం సంగొళ్లిలో ఉరివేసిన నందగడ అభివృద్ధి కోసం 2016-17లో ప్రత్యేక ప్రాధికార ఏర్పాటు చేశారు. రాయణ్ణ స్మారకంగా తీర్చేందుకు వంద ఎకరాల భూమిని కేటాయించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నిష్ఠావంతుడైన సంగొళ్లి రాయణ్ణ నేటి యువతరానికి స్ఫూర్తికావాలని పిలుపునిచ్చారు. రాయణ్ణ పేరిట ఆర్మీ స్కూల్, శిల్పవనం నిర్మించామని తెలిపారు. ఇందుకు రూ.267 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. బాలికలతోపాటు 230 మంది విద్యార్థులకు ఆర్మీ స్కూల్‌లో చదువుకునే వెసులుబాటు ఉందన్నారు. ఇది దేశభక్తిని పెంపొందించే పాఠశాల కావాలని పిలుపునిచ్చారు. రాయణ్ణ మాతృభూమికోసం చూపిన ప్రేమాభిమానాలను మనమంతా పాటించాలని చెప్పారు. మసీదులను ధ్వంసం చేయడం, ఆలయాల నిర్మాణం మూర్ఖత్వమని, అటువంటి వారికోసం హర్షధ్వానాలు పలకాల్సిన అవసరం లేదన్నారు. రాయణ్ణ లాంటివారి దేశభక్తులను స్మరించుకుంటూ చప్పట్లు చరచాలన్నారు. ఎమ్మెల్యే మహంతేశ్ కౌజలగి లాంటి వారు రాజకీయాల్లో ఉండాలని, సమాజంలో ద్వేషాన్ని ప్రేరేపించేవారు కాదన్నారు. ఐదు గ్యారెంటీలకు ఈ ఏడాది రూ.38వేల కోట్లు ఖర్చు చేశామని, అయితే ఆర్థిక పరిస్థితి దివాళా అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్థిక దివాళా అయితే గ్యారెంటీలు ఎలా కొనసాగిస్తామని ప్రశ్నించారు. మంత్రి సతీశ్‌జార్కిహొళి మాట్లాడుతూ సంగొళ్లి రాయణ్ణ పేరు శాశ్వతం కావాలని, భావితరాలకు ఆయన సాధనలు తెలపాలనే రాయణ్ణ పేరిట ఆర్మీ స్కూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంగొళ్లి హిరేమఠ గురుసిద్ధలింగేశ్వర సంస్థానం గురులింగ శివాచార్యస్వామిజీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కొరత ఉందని, పరిష్కరించాలని సూచించారు. బెళగావి జిల్లా వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. మంత్రులు బైరతి సురేశ్, శివరాజ్ తంగడగి, విప్ అశోక్‌పట్టణ, ఎంపీ మంగళా అంగడి, ఎమ్మెల్యేలు ఆసిఫ్ సేఠ్, గణేశ్ హుక్కేరి, మాజీ మంత్రులు హెచ్‌వై మేటి, హెచ్ఎం రేవణ్ణ పాల్గొన్నారు.

బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి...

ఫిబ్రవరి 16న ఉప ఎన్నిక

- కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్టణ్ణ
- బీజేపీ-జేడీఎస్ తరపున ఉమ్మడి అభ్యర్థి



బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరి 16న ఉప ఎన్నిక జరగనుంది. గత ఏడాది మార్చిలో ఎమ్మెల్సీ స్థానానికి పుట్టణ్ణ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగానే ఉంది. శాసనసభ ఎన్నికల సమయంలో బీజేపీకి రాజీనామా చేసిన ఆయన కాంగ్రెస్‌లో చేరి బెంగళూరు రాజాజినగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ ఉప ఎన్నికలో గెలుపొందే అభ్యర్థి 2026 నవంబరు 11 వరకు ఎమ్మెల్సీగా కొనసాగుతారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఉప ఎన్నిక నోటిఫికేషన్‌ను ఈనెల 23న విడుదల చేయనున్నారు. ఆ రోజు నుంచే నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్లను దాఖలు చేసేందుకు ఈనెల 30 చివరి తేదీగా ఉంటుంది. 31న నామినేషన్ల పరిశీలన జరగనుండగా ఉప సంహరణకు ఫిబ్రవరి 2 వరకు సమయం ఉంటుంది. ఫిబ్రవరి 16న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 20న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా నగరంలో మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నియోజకవర్గం పరిధిలోని బీబీఎంపీ, బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, రామనగరం జిల్లాల్లో మంగళవారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది.

కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్టణ్ణ

కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్టణ్ణ బరిలోకి దిగడం దాదాపు ఖాయంలా కనిపిస్తోంది. అధిష్ఠానం నుంచి ఈ మేరకు పుట్టణ్ణకు సంకేతాలు అందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతంలో పలు మార్లు జేడీఎస్ తరపున గెలుపొందిన పుట్టణ్ణ బీజేపీలో చేరి గెలుపొందారు. శాసనసభ ఎన్నికల సమయంలో మళ్లీ పార్టీ మారారు. బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఒక వేళ ఈసారి గెలిస్తే రాష్ట్రంలో మూడు ప్రధాన రాజకీయ పార్టీల టికెట్‌పై గెలుపొందిన తొలి ఎమ్మెల్సీగా ఆయన అరుదైన చరిత్రను సృష్టించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నిక అధికార కాంగ్రెస్‌కు అగ్నిపరీక్ష కానుంది. మరోవైపు బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిని రంగంలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ దిశలో మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామితో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర త్వరలో చర్చలు జరిపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవడం ద్వారా లోక్‌సభ ఎన్నికల ముందు వాతావరణాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ కసరత్తు చేస్తున్నాయి. బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గంలో పుట్టణ్ణకు గట్టి పట్టు ఉండటంతో తమ గెలుపు సునాయాసమని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది.

డీకే శివకుమార్‌తో మొయిలీ భేటీ



డీకే శివకుమార్‌తో చర్చిస్తున్న ఎం.వీరప్పమొయిలీ

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బెంగళూరు కుమారకృప అతిథి గృహంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎం.వీరప్ప మొయిలీ భేటీ అయ్యారు. ఉభయులూ దాదాపు అరగంటకు పైగా పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. చిక్కబళ్లాపురం టికెట్‌ను ఆశిస్తున్న మొయిలీ ఇప్పటికే అధిష్ఠానం పెద్దలకు తన మనసులో మాట చెప్పారని, కేపీసీసీ తరపున కూడా తన పేరు సిఫార్సు అయ్యేలా ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే మొయిలీ కేపీసీసీ అధ్యక్షుడు కూడా అయిన డీకే శివకుమార్‌ను కలిసి ఉంటారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఇద్దరు ఉన్నతాధికారులకు ఎన్నికల సంఘం జాతీయ పురస్కారాలు

- 25న ఢిల్లీలో ప్రదానం

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి రెండు జాతీయ పురస్కారాలను ప్రకటించింది. ఎన్నికల నిర్వహణలో అత్యంత చురుకైన పాత్రను పోషించి ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేసినందుకు గాను ప్రతి యేటా జాతీయ స్థాయిలో ఈ అవార్డులను ఇస్తున్న సంగతి విదితమే. శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఓటర్ల జాగృతి కార్యక్రమాలను అత్యంత విజయవంతంగా నిర్వహించినందుకు గాను రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన చిత్రదుర్గ జిల్లా అధికారిణి దివ్యాప్రభుకు, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ హోదాలో ఓటర్లు ముడుపులు అందుకోకుండా జాగృతి కార్యక్రమాలను నిర్వహించిన సి.శిఖాకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారాలకు ఎంపికైన ఇద్దరూ ఐఏఎస్ అధికారులే కావడం గమనార్హం. ఈ నెల 25న ఢిల్లీలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం వేదికపై ఈ ఇద్దరికీ పురస్కారాలను అందజేసి గౌరవిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



చిత్రదుర్గ జిల్లా అధికారి దివ్యా ప్రభు



వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ సి.శిఖా

మైసూరు - చెన్నై మధ్య

హైస్పీడ్ రైలు

- భూసేకరణకు అధికారుల కసరత్తు
- త్వరలోనే డీపీఆర్ సిద్ధం
- పూర్తయితే 2.25 గంటలే ప్రయాణం



బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మైసూరు - చెన్నై మధ్య హైస్పీడ్ రైలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి కీలకమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 435 కిలోమీటర్ల దూరం ఉండే ఈ మార్గంలో కేవలం 2.25 గంటల వ్యవధిలోనే ప్రయాణించే వెసులుబాటు రానుంది. ఆటోమొబైల్ హబ్ చెన్నై, టెక్, స్టార్టప్ హబ్ బెంగళూరు, సాంస్కృతిక రాజధాని మైసూరు మధ్య ఈ హైస్పీడ్ రైలు సంచరించనుంది. కర్ణాటక, తమిళనాడు మధ్య ప్రయాణ వ్యవధిని తగ్గించేలా రైలుమార్గం ఏర్పాటు కానుంది. ఈ బుల్లెట్ ట్రెయిన్ చెన్నై, పూనమల్లి, అరక్కోణం, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, బంగారపేట, బెంగళూరు, చెన్నపట్టణ, మండ్య, మైసూరుతో కలిపి 9 స్టేషన్లలో ఆగనుంది. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ జనరల్ అలైన్‌మెంట్ డ్రైవ్స్ సర్వే, ఓవర్‌హెడ్, ఓవర్ గ్రౌండ్, అండర్ గ్రౌండ్, యుటిలిటీ సబ్‌స్టేషన్ పవర్‌సోర్సింగ్ విభాగాలను కాంట్రాక్టుకు ఇవ్వనున్నట్టు సమాచారం. హైస్పీడ్ రైలు కారిడార్ మార్గంలో సర్వే సాగుతున్నట్టు తెలుస్తోంది. హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ అధికారులు, భూముల యజమానులతో ప్రాంతాలవారీగా చర్చిస్తున్నట్టు సమాచారం. మరికొన్ని రోజుల్లోనే హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి అంచనా వ్యయంతోపాటు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రకటించనున్నారు. మరో రెండు నెలల వ్యవధిలోనే ఈ మార్గానికి సంబంధించి శంకుస్థాపనలు జరిగే అవకాశం ఉంది. బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ వేకు అనుబంధంగానే నిర్మించే అవకాశం ఉంది. ఇది బెంగళూరు శివారులోని హొస్కోటలో ప్రారంభమై చెన్నైలోని పెరంబదూరులో ముగియనుంది. చెన్నైలో రెండో విమానాశ్రయానికి సమీపంలో రానుంది. ప్రస్తుతం మైసూరు - చెన్నై మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సంచరిస్తోంది. వందేభారత్ ఆరున్నర గంటలపాటు ప్రయాణం సాగుతుంది. బుల్లెట్ రైలు సేవలు అందుబాటులోకి వస్తే కేవలం 2.25 గంటల వ్యవధిలోనే చెన్నై చేరుకోవచ్చు. హైస్పీడ్ రైలు గంటకు 350 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనుంది. అయితే భద్రతా దృష్ట్యా ఈ వేగాన్ని 250 కిలోమీటర్లకు తగ్గించారు. ప్రతి రైలులో 750 మంది ప్రయాణించే వెసులుబాటు ఉంది. హైస్పీడ్ రైల్ ఏర్పడితే విమానాల ద్వారా సంచరించే వారి సంఖ్య తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. 2016లో జర్మనీకి చెందిన ఇంజనీర్ల బృందం చెన్నై - మైసూరు హైస్పీడ్ రైల్ కారిడార్‌పై కార్యాచరణపై అధ్యయనం చేశారు. 2018లో తుది నివేదికను రూపొందించారు. వాటి ప్రకారం 435 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణానికి కనీసం లక్ష కోట్లు ఖర్చు కానుందని అంచనా.

మార్చి 25 నుంచి

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు మార్చి 25 నుంచి నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పరీక్షా మౌల్యమాపనమండలి ప్రకటించింది. ఈ మేరకు బుధవారం పరీక్షల తేదీలను ఖరారు చేసింది. 25న ప్రథమభాష పరీక్షలు ఉంటాయి. 27న సమాజ విజ్ఞానం, 30న విజ్ఞానం, రాజ్యశాస్త్రం, ఏప్రిల్ 2న గణితం, సమాజశాస్త్రం, 3న అర్థశాస్త్రం, 4న థర్డ్ లాంగ్వేజ్ హిందీ, 6న సెకండ్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ పరీక్షలు కొనసాగనున్నాయి. కన్నడ సబ్జెక్టులో వందమార్కులకు, మిగిలిన సబ్జెక్టుల్లో 80 మార్కులకు పరీక్షలు ఉంటాయి. ఉదయం 10.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షలు జరగనున్నాయి.

1 నుంచి ద్వితీయ పీయూ పరీక్షలు

మార్చి 1నుంచి ద్వితీయ పీయూసీ పరీక్షలు జరగనున్నాయి. 1న కన్నడ, 4న గణిత, శిక్షణశాస్త్రం, 5న రాజ్యశాస్త్రం, సంఖ్యాశాస్త్రం, 7న ఇతిహాస, భౌతిక శాస్త్రం, 9న ఐచ్ఛిక కన్నడ, లెక్కశాస్త్ర, భూగర్భశాస్త్రం, గృహవిజ్ఞాన, 11న తర్కశాస్త్రం, వ్యవహార అధ్యయనం, 13న ఇంగ్లీష్, 15న సైకాలజీ, రసాయనశాస్త్రం, మూలగణితం, 16న అర్థశాస్త్రం, 18న భూగోళశాస్త్రం, జీవశాస్త్రం, 20న సమాజశాస్త్రం, విద్యున్మానశాస్త్రం, గణకవిజ్ఞానం, 22న హిందీ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి సబ్జెక్టులోనూ 80మార్కులకు పరీక్షలు జరగనుండగా ఉదయం 10.15 గంటల నుంచి 1.30 దాకా కొనసాగనున్నాయి. ప్రశ్నాపత్రం చదువుకునేందుకు 15 నిమిషాల ముందే కేంద్రాలకు రావాల్సి ఉంటుందని అధికారులు సూచించారు.


రాష్ట్రానికి

పెట్టుబడుల వెల్లువ

దావోస్ సదస్సులో రూ.22వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు

రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న విశ్వ ఆర్థిక శిఖరాగ్ర సదస్సులో రాష్ట్రంలో రూ. 22వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి సంతకాలు జరిగాయి. ఈ సమావేశంలో రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ నాయకత్వంలోని ఉన్నతాధికారుల ప్రతినిధివర్గం పాల్గొంటోంది. దావోస్‌లో బుధవారం జరిగిన ఒప్పందాల వివరాలతో మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. విజయపురలో రూ.300కోట్ల పెట్టుబడితో లులు ఆహార సంస్కరణల విభాగం, బెంగళూరులో వెబ్ వర్క్స్ కంపెనీచే అత్యాధునిక టాటా సెంటర్‌పార్క్ వంటివి ఇందులో ఉన్నాయన్నారు. మొత్తం రూ. 22వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు. ఇందులో వెబ్‌వర్క్స్ కంపెనీ బెంగళూరులో వంద మెగావాట్ల సామర్థ్యం కల్గిన రూ.20వేల కోట్ల పెట్టుబడులతో కూడిన డేటా సెంటర్ పార్క్ కూడా ఉందన్నారు. ఇది కాకుండా మైక్రోసాఫ్ట్, ఇటాచి, లులు గ్రూప్, హెల్వెట్ ప్యాకెర్డ్ (హెచ్‌పీ) సంస్థ, హనీవెల్, ఐనాక్స్, ఓల్వో, నెస్లె, కాయిన్‌బేస్, డికేడా ఫార్మా డీఎల్ ఆగ్రో తదితర కంపెనీలు రూ.2వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నాయన్నారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చితే వేలాదిమంది నిపుణులైన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.92	1,620.49
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,965
సామర్థ్యం (టీఎంసీలు)	10.15	62.72

ఘనంగా జ్ఞానామృత వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీరభద్రప్ప

బళ్లారి సిటీ,జనవరి 17: జ్ఞానామృత విద్యాసంస్థల ఆడిటోరియంలో కాలేజీ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత సాహితీవేత్త వీరభద్రప్ప జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి జ్ఞానామృత విజాయాలను కొనియాడారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాలాక్షప్ప మాట్లాడుతూ జ్ఞానామృత విద్యాసంస్థలు అత్యున్నతమైన సౌకర్యాలతో విద్యను అందిస్తాయన్నారు. నీట్ తదితర పోటీ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన వారికి బహుమానాలు అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా బసవరాజు, బసవరాజపూజారి, ఎం.జీ, మల్లికార్జునగౌడ తదితరులు పాల్గొన్నారు. తదనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

మిరప రైతులకు పరిహారం అందించాలి



మెట్ట భూముల్లో ఎండిపోయిన మిరప పంట

సిరుగుప్ప, జనవరి 17 : వర్షాభావం కారణంగా మెట్ట సాగు భూములలో వేసిన మిరప పంటలు ఎండిపోయి ఎకరాకు వేలాది రూపాయల మేర పంట నష్టం సంభవించింది. సిరుగుప్ప తాలుకాలో ఆదోని రోడ్డు మార్గంలో బంద్రాల్, అగసనూరు, ఇటిగేహాళ్, తదితర గ్రామాలలో మిరప పంట వేశారు. సాగు సమయంలో వర్షాలు రాక పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేసినా ఇంతవరకు పరిహారం చెల్లించకపోవడం గమనార్హం. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి కరువు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఖాదర్‌షా మౌలా ఉరుసు



ఖాదర్‌షామౌలా ఆశీర్వాదం పొందుతున్న ప్రముఖులు

సిరుగుప్ప, జనవరి 17: ఘనంగా ఖాదర్‌షా మౌలా తాత వారి మహోత్సవాలు జరిగాయి. సిరుగుప్ప పట్టణంలో 9వ వార్డులో వెలసిన ఖాదర్‌షా తాత వారి ఉరుసు వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, జియారత్ కార్యక్రమాలను భక్తులు భక్తిపూర్వకంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ముస్లిం గురువులు ఖురాన్ పఠిస్తూ ఖాదర్‌షా మౌలా తాత వారి దర్శనం చేసుకున్నారు. ముస్లిం ప్రముఖులు అబ్దుల్ నబీ, మహమ్మద్ ఖాద్రి, అబ్దుల్ ఘని, సౌదాగర్ పాల్గొన్నారు.

గిడ్డంగి పనులను త్వరగా పూర్తి చేయండి

కంప్లి, జనవరి 17 : కంప్లి నుండి జానూరుకు వెళ్లె రోడ్డు మార్గంలో ధాన్యం నిల్వ చేసే గిడ్డంగి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. ఆయన బుధవారం గిడ్డంగులను పరిశీలించారు. నాలుగు గిడ్డంగులు మంజూరు కాగా కేవలం రెండు మాత్రమే పూర్తికాగా మరో రెండిటి పనులు మధ్యలోనే ఆగిపోయి వుండటంతో వాటిని పరిశీలించారు. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అధికారులతో చర్చించి వెంటనే పనులను పూర్తి చేసి గిడ్డంగులను రైతులకు, ఇతరులకు అనుగుణంగా సిద్ధం చేయాలని కోరారు.

బళ్లారి గడ్డికి భారీ డిమాండ్

● పొరుగు జిల్లాలకు సరఫరా బంద్ ● మెట్టప్రాంతాల రైతుల గగ్గోలు



వరిగడ్డి వామి వేసి నిల్వఉంచిన దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 17: ఈ సంవత్సరం వర్షభావ పరిస్థితులవల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లాలోని సిరుగుప్ప, కంప్లి, సండూరు, బళ్లారి నియోజకవర్గాల పరిధిలో లక్షలాది ఎకరాల వర్షాధారిత భూములతో పాటు తుంగభద్ర ఆయకట్టు భూములు కూడా ఉన్నాయి. ఇప్పటిదాకా తుంగభద్ర ఆయకట్టు భూముల్లో ప్రతిఏటా రెండు పంటలు పండడం వలన పశువులకు మేత కరువు ఉండేది కాదు. కాని ఈ ఏడాది వర్షాలు పడక తుంగభద్ర డ్యాంలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో రబీ పంటకు నీరులేకుండా పోయింది. దీంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడి పాడిరైతులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రతి ఏటా తుంగభద్ర ఆయకట్టుకింద సాగుచేసిన వరి రైతులు వడ్లను మాత్రమే తీసుకుని సగంగడ్డిని అమ్ముకునేవారు. ఈఏడాది అసలు గడ్డిపోచే కనిపించడంలేదు.

-పొరుగు జిల్లాలకు వరిగడ్డి సరఫరా బంద్

ఈసారి తుంగభద్ర ఆయకట్టుకింద సాగు చేసిన రైతులకు మాత్రమే పశువులకు మేత లభిస్తుంది. మెట్టపొలాల రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. వర్షాభావం కారణంగా పొరుగు జిల్లాలైన కర్నూలు, అనంతపురం రైతులు పశువుల మేత కోసం వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. వరిగడ్డి ట్రాక్టర్‌కు రూ. 5-10వేల వరకు పలుకుతోంది. దీంతో పొరుగు జిల్లాలకు వరిగడ్డిని సరఫరా చేయకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దాదాపు 90శాతం పైగా వరిగడ్డిని ఇప్పటికే ఇతర ప్రాంతాలకు తరలించారని, దీంతో ఉన్నగడ్డికి డిమాండ్ ఏర్పడిందని రైతులు అంటున్నారు.

సేంద్రియం ముద్దు ...రసాయనం వద్దు

●కన్నడనాడు రైతుసంఘం ప్రారంభోత్సవంలో కళ్యాణమఠం స్వామి ఉద్బోధ

బళ్లారి గాంధీనగర్, జనవరి 17: దేశానికి వెన్నెముకగా చెప్పుకోవడమే గాని రైతుల కష్టాలు పట్టించుకునే నాథుడే కరవయ్యాడని బళ్లారి నగరానికి చెందిన కమ్మరచేడు సంస్థాన మఠం కళ్యాణ స్వామిజీ అభిప్రాయ పడ్డారు. రైతు సంక్షేమానికి పాటుపడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని మరిచాయన్నారు. బళ్లారి ఏపీఎంసి మార్కెట్ ప్రాంగణంలో బుధవారం 'కన్నడ నాడు రైతు సంఘం' కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతుల వ్యవసాయ విధానంలో మార్పులు రావాలన్నారు. అధిక దిగుబడి కోసం రైతులు పంటలపై విచ్చలవిడిగా రసాయన మందులు ఉపయోగించడంద్వారా పంట ఉత్పత్తుల మాట దేవుడెరుగు గాని.. నూరేళ్ళపాటు ఉండాల్సిన భూమి సారాన్ని కోల్పోయి పంటల దిగుబడి తగ్గిపోతోందన్నారు. ఈ కారణంగా రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆందోళనవ్యక్తం చేశారు. రైతులు సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని అలవరుచుకుని ఆరోగ్యవంతమైన పంటలను మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే పాడి పరిశ్రమను రైతులు కాపాడాలని, అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఒకప్పుడు నగర ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పాల కోసం వేచి చూడాల్సి వచ్చేదని, అయితే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాల నుండి వచ్చే పాకెట్ పాలకోసం ఎదురు చూసే దుస్థితి నెలకొనడం విచారించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం నుంచి రైతులు కేవలం విద్యుత్‌ను, మద్దతుధరను పొందాలేగాని నాసిరకం విత్తనాలు, రసాయన మందులు పొందరాదన్నారు. విత్తనాలను, ఎరువులను రైతులే తయారు చేసుకుని మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం కన్నడనాడు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరప్ప మెణసిన మాట్లాడుతూ తనకు గతంలో రైతు సంఘంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఇన్నాళ్ళు రైతు సంఘంలో ఒక సభ్యుడిగానే మెలిగానని, అయితే రైతు సమస్యల పరిష్కారానికి అవకాశం రాలేదని, ఈ కారణం చేతనే తానే కన్నడనాడు రైతు సంఘం స్థాపించి రైతు సమస్యల పరిష్కారానికి పోరాడాలనే సంకల్పంతో ముందుకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా గౌరవ అధ్యక్షులు హెచ్.శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, మరేగౌడ, ఆర్.ప్రహ్లాద్, సంఘం న్యాయ సలహాదారులు టి.సిద్దరామనగౌడ, జి.భాస్కర్ రెడ్డి, పి.మంజునాథ్, జి.ఈరణ్ణ, గడిగె రుద్రగౌడ, శివమూర్తి, ఎస్.చంద్రణ్ణ, ఎన్.నాగేంద్ర, ఎల్.మంజునాథ్ గౌడ, కార్యకారిణి సభ్యులు పాల్గొన్నారు.



రైతుసంఘం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కళ్యాణమఠం స్వామి

వైభవంగా కరిసిద్ధేశ్వర రథోత్సవం

కంప్లి, జనవరి 17 : విజయనగర జిల్లా హోస్పేట తాలుకా పరిధిలోని బుక్కసాగర కొండల్లో వెలసిన కరిసిద్ధేశ్వర స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. కరిసిద్దేశ్వర శివాచార్య స్వాముల 11వ పుణ్యారాధన సందర్భంగా 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. 14 రోజుల పాటు పురాణపఠనం చేశారు. చివరిరోజు రథోత్సవంతో పాటు రంబాపురి వీరసోమేశ్వర రాజదేశి కేంద్ర శివాచార్య స్వాములకు అడ్డపల్లకి ఉత్సవం నిర్వహించారు. కంప్లి, హోస్పేట, గంగావతి గ్రామాల నుంచి కూడా భక్తాదులు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర శివాచార్య స్వామి, మల్లికార్జున శివాచార్య స్వామి కరిసిద్ద ఈశ్వర శివాచార్య స్వామి, వామదేవ మహంత శివాచార్య స్వాములు, సిద్దలింగ శివాచార్యులు, శశిధర శాస్త్రి, కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.

ఏళుపడగల నాగప్ప దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా హంపీ పుణ్యక్షేత్ర పరిసరాల్లో బుక్కసాగర పరిధిలోని కొండల్లో వెలసిన ఏళుపడగల నాగప్పకు బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాహువు, కేతువు, నాగసర్ప దోషాలు వున్న వారు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. విశ్వనాథ స్వామి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులకు దేవాదాయ శాఖ అన్నప్రసాదం పంపిణీ చేసింది.



బుక్కసాగరలో సాగుతున్న రథోత్సవం

అనుమానాస్పద వ్యక్తులపై నిఘాతోనే చోరీలకు బ్రేక్

కంప్లి, జనవరి 17 : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ ఉలిగేష్ తెలిపారు. గత రెండు మూడు రోజులుగా ఇళ్ల ముందు, కార్యాలయాల ముందు లాక్ చేసిన వాహనాలను దొంగలు తీసుకెళుతున్నారని, ఈ విషయం తెలుసుకున్న తాను పోలీసులను అప్రమత్తం చేశానన్నారు. కానీ రాత్రివేళల్లో అనుమానాస్పదవ్యక్తులు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. కొందరు జిందాల్ కర్మాగారాల్లో గానీ, ఇతర పనులు లేక దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. శుభ కార్యాలకు వెళ్లేవారు ఇంటి పక్కనవున్న వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యమైన వస్తువులు, ఆభరణాలను లాకర్లలో వుంచుకోవాలన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ హోస్పేట - బళ్లారి బైపాస్ రోడ్డు మూడవ వార్డుకు అతిదగ్గరగా వుండటంతో ఆ వార్డుల్లో ఎక్కువగా దొంగతనాలకు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు.

హంపీ ఉత్సవాలకు స్థల పరిశీలన



ఉత్సవాలకు స్థలపరిశీలన చేస్తున్న కలెక్టర్ దివాకర్, ఎమ్మెల్యే గవియప్ప

హొసపేట, జనవరి 17: ఫిబ్రవరి 2,3,4తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న హంపీ ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గవియప్ప స్థలపరిశీలన చేశారు. ఉత్సవాల్లో బసవన్నగుడి సమీపంలోనూ, గాయత్రీపీఠం వద్ద ప్రధానవేదికల కోసం పరిశీలించారు. పార్కింగ్ తాగునీరు, అల్పాహారం తదితర ఏర్పాట్లపై కూడా చర్చించుకున్నారు. ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే గవియప్ప విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా హంపీ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయం తీసుకున్నారని, కాబట్టి అన్ని ఉత్సవాల కంటే ఎక్కువ ప్రాధాన్యతతో దీనిని నిర్వహించాలన్నారు. ప్రతి రెండు రోజుల కొకసారి జిల్లాకలెక్టర్‌తో మాట్లాడి ఉత్సవాలకు సంబంధించి సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకే డి.కె. శివకుమార్, ఇన్‌చార్జిమంత్రి జమీర్‌అహ్మద్ సహకారంతో నిర్ణయాలు తీసుకుని పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా హరపనహళ్ళి ఎమ్మెల్యే పి.లత, జిల్లాపంచాయితీ కార్యనిర్వహణాధికారి సదాశివప్రభు, సహాయ కమిషనర్ అక్రమ్, అదనపు ఎస్పీ సలీంపాషా, తహసీల్దార్ విశ్వజిత్ మెహతా, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయం వద్ద స్వచ్ఛతా సేవ



సోమేశ్వరాలయం వద్ద పారిశుధ్య పనులను ప్రారంభించిన బీజేపీ నాయకులు

కంప్లి, జనవరి 17 : కంప్లి పట్టణ వాసుల ఆరాధ్యదైవమైన సోమేశ్వరాలయం వద్ద బాజాపా నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛతా సేవ ప్రారంభించారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఈ నెల 20 వరకు కంప్లి నియోజకవర్గంలోని కురుగోడు, దమ్మూరు, ఎమ్మిగనూరు, కంప్లి సోమేశ్వర పుణ్యక్షేత్రాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్లు బీజేపీ క్షేత్ర అధ్యక్షులు హళ్లి వీరేష్ తెలిపారు. కంప్లి సోమేశ్వరాలయ ప్రాంగణంలో స్వచ్ఛతా సేవకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉచ్చప్ప, బ్రహ్మయ్య, పురుషోత్తమ్, సుధాకర్, రామాంజినేయులు, జీసీ చంద్రన్న, సుదర్శన్ రెడ్డి, డాక్టర్ అశోక్, కొడిదల రాజు, విరుపాక్షి, తదితరులు పాల్గొన్నారు.

దేవదాసీలకు ఇళ్లను మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గాలెప్ప తదితరులు

హొసపేట,జనవరి 17: దేవదాసీలకు వసతి సౌకర్యం కల్పించకుంటే తీవ్రపోరాటం చేపడుతామని కర్ణాటక రైతు సంఘం, హరిత సేన విజయనగరం జిల్లాధ్యక్షుడు సి.వి.గాలెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విజయనగరం జిల్లాకలెక్టర్ దివాకర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా గాలెప్ప మాట్లాడుతూ, జిల్లాకలెక్టర్ వారంలోపుగా స్పందించకుంటే సంబంధిత శాఖ ఎదుట రాష్ట్రనేతలతో ఉధృత పోరాటం చేస్తామన్నారు. అయ్యనహళ్ళి గ్రామ పరిధిలోకి వచ్చే ప్రభుత్వభూమిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు ఇవ్వకూడదన్నారు. కలెక్టర్ వినతి పత్రాన్ని స్వీకరించి సంబంధిత అధికారులకు చెబుతానని హామీఇచ్చారు.

21న మహిళా న్యాయవాదుల సదస్సు



మాట్లాడుతున్న న్యాయవాది ఈరమ్మ

రాయచూరు జనవరి 17: నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయ ఆవరణలో ఈ నెల 21వ తేదీన మహిళా న్యాయవాదుల రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని మహిళా న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షురాలు, న్యాయవాది ఈరమ్మ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న నేటికాలంలో న్యాయవ్యవస్థలో మహిళలు కీలక మాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ క్రమంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు మహిళా న్యాయవాదుల సమావేశం ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల నుంచి మహిళా న్యాయవాదులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

హొసూరు జోన్

ప్రేమికుల దినోత్సవానికి రోజాలు రెడీ!



ప్రేమికుల దినోత్సవానికి సిద్ధమవుతున్న గులాబీ పూలు

హొసూరు జనవరి 17 : ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14న ప్రపంచ వ్యాప్తంగా ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇందుకోసం కృష్ణగిరి జిల్లా హొసూరు సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల్లో రైతులు వేలాది ఎకరాల్లో గుడిసెలు వేసుకుని పూలను పండిస్తున్నారు. వారు నాణ్యమైన పువ్వుల ఉత్పత్తిలో నిమగ్నమై ఉన్నారు. గ్లోబల రోజపూలు, తాజ్ మహల్, పసుపు రోజాలు, తెల్లటి రోజాలు, తదితర 50 రకాల పూలను పెంచుతున్నారు, ఒక పూవు రూ.10 పలుకుతుంది, హొసూరు నుంచి వివిధ రాష్ట్రాలకు కూడా ఎగుమతిచేస్తుంటారు, రోజా పూలో స్టంప్ నీటుగా రావాలని వ్యవసాయ దారులు రోజా చెట్లను పోషిస్తూ, పూలను రక్షిస్తూ ఉన్నారు, ప్రస్తుతం విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా పూల మొక్కలకు రోగాలు సోకే ప్రమాదం ఉందని, దీంతో పూల నాణ్యత ఉత్పత్తితగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

హొసూరు(క్రైం) జనవరి 17 : ఏనుగు దాడికి గురై మృతిచెందిన కెలమంగలం సమీపంలోని అనుమంతపురం గ్రామానికి చెందిన మమత కుటుంబానికి ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. మంగళవారం ఏనుగుదాడికి గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం కోసం ఆమె మృతదేహాన్ని హొసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృత దేహానికి నివాళులర్పించిన హొసూరు ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున ముందుగా రూ.50 వేలు అందించారు. అనంతరం ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు అందిస్తామని తెలిపారు. మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రాంతీయ డీఎంకే కార్యదర్శి రాము,జిల్లా ఆర్గనైజర్ శక్తివేల్ పాల్గొన్నారు.

వన సంక్రాంతి పోటీల్లో విజేతలకు బహుమతులు

హొసూరు (కృష్ణగిరి) జనవరి 17: మూడు రోజుల సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం రోజున వన సంక్రాంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు కుటుంబంతో పాటు అందరూ అటవీ ప్రాంతాలకు వెళ్లి వన భోజనం చేస్తూ ఆటలు, పోటీలు జరుపుకుంటారు. ప్రభుత్వం తరపున పెరియముత్తూరు పంచాయతీ యూనియన్ అవధానపట్టిలో ఈ వన సంక్రాంతి పండుగను కలెక్టర్ సరయు ప్రారంభించారు. ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందించారు, భారతీ ఆర్ట్ గ్రూప్ వారిచే తప్పెటలతో సాంప్రదాయక ఆటలు, పోటీలు నిర్వహించారు, ఈ కార్యక్రమంల్లో కృష్ణగిరి అటవీ అధికారి ఎం.ఆనందన్, జిల్లా కలెక్టర్ విజయకుమార్, జిల్లా అభివృద్ధి అధికారి మురుగన్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు బానుప్రియ నారాయణన్, శివ, పళని, కాంట్రాక్టర్లు చిల్రన్స్ పార్క్ బోట్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పర్యాటకులు , ప్రజలు పెద్ద సంఖ్యల్లో పాల్గొన్నారు.



సంక్రాంతి రోజు ఏర్పాటు చేసిన వనభోజన వేడుకల్లో స్థానికులు

వాహనప్రమాద చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన



రాయచూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వాహన డ్రైవర్లు

రాయచూరు, జనవరి 17 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న మోటారు వాహన చట్టాన్ని వ్యతిరేకిస్తూ డ్రైవర్లు బుధవారం ఆందోళన నిర్వహించారు. ప్రమాదం జరిపిన చోట క్షతగాత్రుడిని స్వయంగా ప్రమాదానికి కారణమైన డ్రైవర్లే ఆస్పత్రిలో చేర్పించాలని చట్టంలో పేర్కొనడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది డ్రైవర్లు ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారు కాకుండా నియంత్రించామని చెబుతుండడం శుద్ధ అబద్ధమన్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగిన చోటే డ్రైవర్లు ఉంటే బాధితుల కుటుంబంతో పాటు ఇతరులు సహితం దాడులకు దిగడం అనేక సందర్భాల్లో జరిగిందన్నారు. కాగా రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయరాదని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్ల ఆందోళనకు ఆటో డ్రైవర్లు కూడా మద్దతుగా నిలవడంతో నగరంలో ఎక్కడికక్కడ వాహనసంచారం నిలిచిపోయింది. దూర ప్రాంతాల నుంచి వచ్చి నగరంలోని వివిధ చోట్లకు వెళ్లేవారు ఆటోలు లేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, ఆటోరిక్షా డ్రైవర్లు భారీర్యాలీ నిర్వహించారు. స్థానిక కన్నడ భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్ వీదుగా జిల్లాధికారి కార్యాలయం వరకు సాగింది.

అనంతకుమార్ హెగ్డేపై చర్యలు తీసుకోవాలి

రాయచూరు జనవరి 17 : ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వ్యతిరేఖంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని షెఫర్డ్ ఇండియా ఇంటర్‌నేషనల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశప్ప డిమాండ్ చేశారు. ఎంపీ అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలను ఖండిస్తూ షెఫర్డ్ ఇండియా కార్యకర్తలు బుధవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు ఎంపీ చిత్రపటానికి చెప్పులదండలు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఎన్టీఆర్ (వర్ధంతి)



రాముడు, కృష్ణుడు వంటి పాత్రలతో తెలుగువారి ఆరాధ్య దైవంగా నిలిచిన నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. గొప్ప నటుడు, ప్రజా నాయకుడు. అభిమానులచే 'అన్నగారు'గా పిలవబడ్డారు. సుమారు 400 సినిమాలలో నటించారు. నిర్మాతగాను, దర్శకుడిగాను వ్యవహరించారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో తనదైన నటనతో 'విశ్వవిఖ్యాత నటసార్వ భౌముడు' బిరుదాంకితులు. 1982లో తెలుగు దేశం పార్టీని స్థాపించి కేవలం 9నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. సినిమాల్లోనే కాక రాజకీయాల్లోనూ పలు రికార్డులు నెలకొల్పారు. 1996 జనవరి 18న కన్నుమూశారు.

ఒలివర్ హార్డీ (జయంతి)



ఒలివర్ నార్వెల్ హార్డీ 1892 జనవరి 18న జన్మించారు. అమెరికన్ కామిక్ యాక్టర్. లారెల్ అండ్ హార్డీ ద్వయంలో ఆయన ఒకరు. 1927-55 మధ్యన మూకీ సినిమాలతో పాటు టాకీలలో కలసి నటిం చారు. 1914లో తొలి సినిమా 'అవుట్ విట్టింగ్ డ్యాడ్' తోనే గుర్తింపు పొందారు. తన పార్ట్‌నర్ స్టాన్ లారెల్ తో కలసి 107 షార్ట్ ఫిల్మ్‌లో నటించారు. 1957 ఆగస్టు 7న కన్నుమూశారు. హార్డీ సొంతూరైన జార్జి యాలోని హార్లెమ్‌లో 'లారెల్ అండ్ హార్డీ మ్యూజి యం'ను ఏర్పాటు చేశారు.

కేరీ గ్రాంట్ (జయంతి)




కేరీ గ్రాంట్ 1904 జనవరి 18న జన్మించారు. ఇంగ్లీష్ బార్న్ అమెరికన్ నటుడు. క్లాజిక్ హాలీవుడ్‌లో తనదైన గుర్తింపు పొందారు. నాటకాలనుంచి వెండి తెరపైకి వచ్చి నటన, హాస్యం పండించారు. 1940, 50లలో ఆయన సినిమాలు హాస్యానికి ఎంతో పేరొందాయి. అకాడమీ అవార్డ్‌కు రెండుసార్లు నామినేట్ అయ్యారు. ఉత్తమ నటుడిగా ఐదుసార్లు గోల్డెన్‌గ్లోబ్ అవార్డు పొందారు. 'సెకండ్ గ్రేటెస్ట్ మేల్‌స్టార్'గా అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. 1986 నవంబరు 29న కన్నుమూశారు.

డానీ కాయె (జయంతి)



డానీ కాయె 1911 జనవరి 18న న్యూయార్క్‌లో జన్మించారు. అసలు పేరు డేనియెల్ కామిన్స్కీ. అమెరికాకు చెందిన నటుడు, గాయకుడు, సంగీత దర్శకుడు, డ్యాన్సర్, కమెడియన్. అంతకుమించి మానవతావాది. ప్రత్యేకించి ఆయన నటించిన 17 సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. వండర్‌మ్యాన్, ది ఇన్‌స్పెక్టర్ జనరల్, వైట్ క్రిస్మస్, ది కోర్ట్ జెస్టర్ వంటివి ప్రముఖమైనవి. 1954లో యునిసెఫ్ తొలి రాయబారిగా వ్యవహరించారు. 1987 మార్చి 3న కన్నుమూశారు.

ఎస్ బాలచందర్ (జయంతి)



సుందరం బాలచందర్ 1927 జనవరి 18న జన్మించారు. వీణా బాలచందర్‌గా సుపరిచితులు. బాల్యం నుంచే సంగీతంపై మక్కువతో రాణించారు. తమిళ సినిమా రంగంలో పేరొందిన దర్శకులు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించగా మరి కొన్నింటిలో ఆయనే నటించారు. పాటలు పాడడమే కాక సంగీత దర్శకత్వం వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తమిళ సినీ రంగంలో చెరగని ముద్రవేశారు. 1982 లో 'పద్మ భూషణ్' పురస్కారం అందుకున్నారు. 1990 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

బండారు అచ్చమాంబ (వర్ధంతి)



బండారు అచ్చమాంబ 1874లో కృష్ణా జిల్లా నందిగామ వద్ద జన్మించారు. తొలి తెలుగు కథా రచయిత్రి, ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణి. 'అబలా సచ్చరిత్ర మాల' అనే గ్రంథాన్ని రచించగా కందుకూరి వీరేశలింగం పంతులు తమ చింతామణి ముద్రణాలయంలో ప్రచురించారు. ఇందులో వెయ్యి సంవత్సరాలలో ప్రసిద్ధి చెందిన భారత స్త్రీల కథలు ఉన్నాయి. మచిలీపట్నంలో తొలి మహిళా సంఘం 'బృందావన స్త్రీల సమాజం'ను స్థాపించారు. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' కూర్చిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుకు అక్క. కాగా 30వ ఏట 1905 జనవరి 18న మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో కన్నుమూశారు.

కేఎల్ సైగల్ (వర్ధంతి)



కుందన్ లాల్ (కేఎల్) సైగల్ 1904 ఏప్రిల్ 11న జమ్మూలో జన్మించారు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన గొప్ప గాయకుడు, నటుడు. హిందీ సినీరంగంలో తొలి సూపర్‌స్టార్ ఆయనే. గమ్మత్తైన గొంతుతో ఎన్నో పాటలు ఆలపించి తనదైన ప్రత్యేకత చాటుకున్నారు. మొహ్మద్ రఫీ, లతా మంగేష్కర్, కిశోర్ కుమార్, ముకేశ్‌లు సైతం ఆయనను సంగీత గురువుగా భావించారు. 15ఏళ్ల కెరీర్‌లో 36 ఫీచర్ ఫిల్మ్‌లో నటించగా 185 పాటలు పాడారు. అందులో సినిమా, భజనలు, గజల్స్ కూడా ఉన్నాయి. 42వ యేట 1947 జనవరి 18న కన్నుమూశారు.

23న లీలావతికి గాన నమన

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ నటి డా.లీలావతి సంస్మరణార్థం ఈ నెల 23న బెంగళూరు రవీంద్ర కళాక్షేత్ర ప్రాంగణంలో గీత నమన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కిట్టిరాజ్ సమర్పణలో జరిగే ఈ కార్యక్రమం రవీంద్ర కళాక్షేత్ర వెనుక గల ఆరుబయట ప్రాంతంలో ఉంటుందని ప్రవేశం పూర్తిగా ఉచితమని నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్వాహకులు వెల్లడించారు.

ఆర్మీపబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో హైబ్రిడ్ లర్నింగ్ శాఖ

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మీపబ్లిక్ స్కూల్ సెంటర్ (ఏఎస్సీ) ఆధ్వర్యంలో విక్టోరియా లేఅవుట్ హైబ్రిడ్ లర్నింగ్ నోడ్ క్లాస్‌రూం ప్రాజెక్టు కార్టీ బ్లాంచ్ ప్రత్యేక కేంద్రాన్ని ఆరంభించారు. ఎఎస్సీ సెంటర్ సౌత్ బ్రిగేడియర్ అజయ్‌దుగ్గల్ బుధవారం వర్చువల్ రూపంలోకేంద్రాన్ని లాంఛనంగా శ్రీకారం చుట్టారు. విద్యారంగంలో దేశవ్యాప్తంగా హైబ్రిడ్ నైపుణ్యతా పరిహారాల వేదికగా పనిచేస్తున్న టెక్ ఆవంత్‌గార్డ్ ద్వారా శాఖ పనిచేయనుందని ప్రిన్సిపాల్ సునీతా పంచనాథన్ తెలిపారు. కొవిడ్ కాలం నుంచే వర్చువల్ రూపంలో తరగతుల ప్రక్రియ ఆరంభించామని ప్రస్తుతం అధునాతన సాంకేతికత అనుగుణంగా విద్యార్థులకు అనుకూలం చేయదలచామన్నారు. టెక్ ఆవంత్ గార్డ్ సీఈఓ అలీసేట్ మాట్లాడుతూ సాంకేతికంగా ఎన్నోరంగాలలో పెనుమార్పులు వచ్చాయని అదే తరహాలోనే రిమోట్ ద్వారా విద్యారంగంలోను నైపుణ్యత పెంచదలచామన్నారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాల విద్యార్థులకు స్కిల్ హబ్‌ఇనిషియేటివ్, డిజిటల్ నైపుణ్యత, ఆర్థిక సలహాలు, హైబ్రిడ్ విద్యావిధానం వంటివి సాధ్యం చేయదలచామన్నారు.



ఆర్మీస్కూల్‌చే నైపుణ్య కేంద్రం ప్రారంభం

తాలూకాస్థాయి జనస్పందన



సమస్యలు ఆలకిస్తున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

బాగేపల్లి, జనవరి 17: పట్టణంలో బుధవారం ఏర్పాటైన తాలూకాస్థాయి జనస్పందన సమావేశంలో ఉన్నత విద్య, చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్వయంగా ప్రజల సమస్యలను ఆలకించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, పురసభ, రెవెన్యూ, ఇంటి, ఇళ్ల స్థలాలు ఇతరత్రా సమస్యలకు సంబంధించి సుమారు 300 వినతులు సమర్పించారు. తాలూకాస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నేరుగా ఇంటి ముంగిటకే వచ్చి సమస్యలు పరిష్కరించేలా కార్యక్రమాన్ని రూపుదిద్దిందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రభుత్వంతో చర్చించి శాశ్వత తాగునీరు, పరిశ్రమలు, రైల్వే పథకాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 'భాగ్యనగర' అని మరునామకరణం చేసేందుకు రెవెన్యూశాఖ మంత్రితో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, జడ్పీ సీఈఓ ప్రకాశ్ జీ నిట్టాలి, ఇన్‌చార్జ్ జిల్లా అధికారి తిప్పేస్వామి, జిల్లా ఉపవిభాగాధికారి అశ్విన్, పోలీసు ఉన్నతాధికారి ఖాసిం, జిల్లా ఉప అరణ్య సంరక్షణాధికారి రమేశ్, తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్, తాలూకా పంచాయతీ ఈఓ జీపీ రమేశ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి, గ్రేడ్ 2 తహసీల్దార్ వీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

మహదేవపుర, జనవరి 17: విద్యార్థులు తమ జీవితంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి సూచించారు. నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్ళి ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన ఆడియో-వీడియో సదుపాయం కల్గిన తరగతి గదిని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అలాగే చిన్నారులు క్రమశిక్షణ, సంయమనం పాటించడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలు నేర్చుకుని ఉత్తమపౌరులుగా సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మనోహరరెడ్డి, ప్రముఖులు నటరాజ్, యోగిశ్ ఆరాధ్య, హరాడి పిళ్ళప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆడియోవీడియో తరగతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కరసేవకుడికి ఘన సన్మానం



సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి కే గోపాలయ్య

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి లేఅవుట్ శాసనసభా నియోజక వర్గంలోని నందిని లేఅవుట్‌లో జరిగిన సంక్రాంతి వేడుక, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రామ జన్మభూమికి కోసం పోరాడి కరసేవలు చేసిన పలువురు ప్రముఖుల్ని ఘనంగా సన్మానించారు. అయోధ్యలో జరిగిన కరసేవలో గతంలో చురుకైన పాత్రను పోషించిన మాజీ మంత్రి రాజాజినగర్ ఎమ్మెల్యే సురేష్‌కుమార్‌ను, మాజీ మంత్రి రామచంద్రగౌడను మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కె.గోపాలయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గోపాలయయ్య ఈ నెల 22న జరిగే రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఒక పండుగలా జరుపుకోవాలన్నారు. అయోధ్య రామ మందిరం దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఐక్యతకు సంకేతం కానుందన్నారు బెంగళూరు మహానగరం వేగంగా విస్తరించకుంటూ పోతోందని ఇదే సందర్భంగా గ్రామ సంస్కృతి క్రమేపీ మాయం అవుతోందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో మాజీ ఉప మేయర్ హేమలతా గోపా లయ్య బెంగళూరు ఉత్తర జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.హరీష్ తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతిని ప్రతిబింబించే రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించారు.

వెంకటప్ప గ్యాలరీ ఆధునికీకరణ

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్మారకాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా బ్రిగేడ్ ఫౌండేషన్ ద్వారా వెంకటప్ప గ్యాలరీ ఆధునీకరణ పనులకు పర్యాటకశాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ శ్రీకారం చుట్టారు. గురువారం వెంకటప్ప ఆర్ట్ గ్యాలరీ ప్రాంగణంలో శంకుస్థాపనల అనంతరం మంత్రి పాటిల్ మాట్లాడుతూ బ్రిగేడ్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ జైశంకర్ నాలుగునెలల కిందట ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారన్నారు. స్మారకాలను పునరుద్ధరించేలా జరిగిన ఒప్పందం ద్వారా భవిష్యత్తులో ఎన్నో చారిత్రాత్మక కేంద్రాలు మనుగుడలోకి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతలోనే వెంకటప్ప గ్యాలరీకు పూర్వవైభవం తీసుకువచ్చేలా ముందుకు రావడం సంతోషమన్నారు. రాష్ట్రంలో 25వేల స్మారకాలకు ఉన్నాయని కేవలం 800ల మాత్రమే గెజిట్‌లో అవకాశం లభించిందన్నారు. మిగిలిన 24వేలకు పైగా స్మారకాల అభివృద్ధికి అడాప్ట్ ఎ మాన్యుమెంట్ ద్వారా రక్షణ, పూర్వవైభవం తీసుకురాదలచామన్నరు. బ్రిగేడ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎంఆర్ జైశంకర్, పర్యాటకశాఖ కార్యదర్శి సల్మా కె ఫాహీం, డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్ మనోహర్, పురావస్తుశాఖ కమీషనర్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకటప్ప గ్యాలరీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పాటిల్

స్తంభించనున్న సరుకు రవాణా

» లారీల నిరవధిక సమ్మె

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్‌కు జైలు శిక్ష విధించడాన్ని నిరసిస్తూ చట్టాలకు తెచ్చిన సవరణలు తక్షణం రద్దు చేయాన్న ప్రధాన డిమాండ్‌తో బుధవారం అర్ధరాత్రి నుంచి లారీల సమ్మె ప్రారంభమైంది. ఫెడరేషన్ ఆఫ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నిరవధిక సమ్మె చేస్తున్నామని ఫెడరేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి మీడియాకు తెలిపారు. కేంద్రప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన కొత్త చట్టాలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేకించి హిట్ అండ్ రన్ కేసులో జైలు శిక్ష విధించాలన్న అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 106 సబ్ సెక్షన్‌లను రద్దు చేయాలని, రాష్ట్రాల సరిహద్దులలో చెక్‌పోస్టులను తొలగించాలని, ఎక్స్‌ఎక్స్ ప్రొడక్షన్ విధిస్తున్న రూ.20వేల జరిమానా తొలగించాలన్నవి తమ ఇతర ప్రధాన డిమాండ్లు అన్నారు. లారీలు సమ్మెబాట పట్టడంతో సరుకురవాణా స్తంభించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్నరోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీగేహళ్లిలో బస్టాండ్ ఏర్పాటు చేయాలి

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా మహిళా సమస్యలపై 'అల్లి సేరోణా' (అక్కడ కలుద్దాం) పేరుతో ఏర్పాటైన కూటమి సీగేహళ్ళిలో బస్టాండ్ అవసరంగా డిమాండ్ చేశారు. నగర వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే వివిధ సామాజిక అంశాలపై ప్రాంతాల వారిగా అల్లి సేరోణా కూటమి సమీక్షల ద్వారా మహిళలను భాగస్వామ్యులను చేస్తోంది. ఈనెల 3నుంచి మల్లప్ప లేఅవుట్, సొణ్ణేనహళ్ళి, ప్రియాంకనగర్, మేదహళ్ళి ప్రాంతాలలో జరిపిన సమీక్షలో బస్టాండ్ అవసరంగా డిమాండ్ చేశారు. ప్రియాంకనగర్‌కు చెందిన అల్లిసేరోణా సమాఖ్య ముఖ్యులు అనురాధ మాట్లాడుతూ బీఎంటీసీ అధికారులతో ఇక్కడి మహిళ అభిప్రాయాలను నివేదిక రూపంలో సమర్పించామన్నారు. సీగేహళ్ళి ప్రాంతం ద్వారా కొత్తగా బస్సుమార్గంతో పాటు బస్టాండ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించారన్నారు. అల్లి సేరోణా సమాఖ్యలో మహిళలు ఉత్సాహంగా భాగస్వామ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు.



బస్టాండు ఏర్పాటు చేయాలని నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రకృతితో సౌందర్యాన్ని పెంచుకోండి

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన ఆహార పదార్థాల ద్వారా సౌందర్యాన్ని పెంచుకోవాలని ప్రముఖ నటి ప్రణీత సుభాష్ అభిప్రాయపడ్డారు. క్యాలిఫోర్నియా ఆల్మండ్‌బోర్డ్ నగరంలో ఆయుర్వేద సౌందర్యం - పాటించాల్సిన విధానాలు అనే అంశంపై చర్చాగోష్టి జరిపారు. ఈ సందర్భంగా న్యూట్రిషియన్ షీలా కృష్ణస్వామి, ఆయుర్వేద నిపుణులు మధుమిత కృష్ణన్, ఆర్‌జే సౌజన్యలు పాల్గొన్నారు. నటి ప్రణీత మాట్లాడుతూ డ్రై ఫ్రూట్స్ ద్వారా ప్రొటీన్, విటమిన్‌లు సమృద్ధిగా లభిస్తాయన్నారు. మధుమిత కృష్ణన్ మాట్లాడుతూ చర్మ సౌందర్యం, కేశసంపదకోసం బాదామిని విరివిగా తీసుకోవాలన్నారు. సందర్శకులు అడిగిన ప్రశ్నలకు న్యూట్రిషన్, ఆయుర్వేద నిపుణులు సలహాలిచ్చారు.



చర్చాగోష్టిలో నటి ప్రణీత తదితరులు

21 నుంచి రామతారక మహా యాగం

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ఈ నెల 22న విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ ఈ నెల 21 నుండి రెండు రోజుల పాటు రామతారక మహాయాగం జరుపనుంది. బెంగళూరు మహాలక్ష్మి లేఅవుట్‌లోని రాణి అబ్బక్క మైదానంలో త్రయోదశ లక్ష శ్రీరామతారక మహాయాగం, సీతా కల్యాణోత్సవం, కలశాభిషేకం నిర్వహించనున్నట్లు మహాసభ అధ్యక్షుడు అశోక్ హారనహళ్ళి నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ధార్మిక కార్యక్రమంలో 25వేలమందికి పైగా భక్తులు పాలుపంచుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు. పలువురు మఠాధిపతులు వేదపండితులు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించనున్నారు.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో ఎస్టీల సమావేశం

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు రాష్ట్ర స్థాయి ఎస్టీల సమావేశాన్ని ఈ నెల 19న ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. పార్టీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బంగారు హనుమంతు నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. వాల్మీకీ కులంతో సహా షెడ్యూల్డ్ తరగతులకు చెందిన 52 కులాలకు చెందిన ప్రతినిధులు, నేతలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, మాజీ మంత్రులు సీటీ రవి. రమేష్ జార్కిహోళి తదితర ప్రముఖులు బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరిగే ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. కాగా అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టినందుకు ప్రధాని నరేంద్రమోదీకి, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఆయన రాష్ట్ర ఎస్టీల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రేవా చాన్స్‌లర్‌కు స్వగ్రామంలో సన్మానం



రేవా చాన్స్‌లర్ డాక్టర్ పి. శ్యామరాజును సత్కరిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పీ శ్యామరాజు సంక్రాంతి నేపథ్యంలో చిత్తూరు పాలసముద్రం మండలం ఎస్ఆర్ ఆర్ కండ్రిగకు విచ్చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఆత్మీయంగా సత్కరించారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధి విజయ్‌కుమార్ సహా పలువురు స్వాగతించి శాలువాతో సన్మానం చేశారు. సంక్రాంతి పండుగ వేళ స్థానిక గ్రామంలోని గంగమ్మ ఆలయంలో పూజలతోపాటు సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్యామల, ప్రముఖులు శివప్రకాశ్ రాజు, మోహన్‌రాజు, రామస్వామి రాజు, సుదర్శన్ రాజు, స్వామిరాజు, ఉమాపతి రాజు, శేఖర్‌రాజు, ధర్మరాజు, రమేశ్‌రాజు, ప్రభాకర్ రాజు, మాధవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు యూనివర్శిటీ నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పశువులకు మేత ఉచిత పంపిణీ



జొన్నగడ్డిని అందజేస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట, జనవరి 17: సంక్రాంతి పండుగ నేపథ్యంలో గోవులకు మేతను పంపిణీ చేయడం ద్వారా పుణ్యం సాధించినట్టయ్యిందని నగరసభ సభ్యుడు ఎంపీ వెంకట స్వామి ఉచితంగా అభిప్రాయపడ్డారు. పశువులు, మేకలు, గొర్రెలకు జొన్నగడ్డిని మూడు ట్రాక్టర్లలో తెచ్చి ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు పదేళ్లుగా సంక్రాంతి పర్వదినాన ఉచితంగా మేత పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నగరసభకు రెండు సార్లు జేడీఎస్ తరపున ఎంపికైన ఈయన స్వయంగా రైతు, కొబ్బరి, మేత విక్రయాలే జీవనంగా ఉన్నారు. వెంకటస్వామి కార్యవైఖరిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అయ్యాయి.

హానగల్ అత్యాచారం కేసులో మరో నిందితుడి అరెస్టు

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా హానగల్‌లో ఈనెల 8న సామూహిక అత్యాచారం కేసులో మరో నిందితుడిని అరెస్టు చేశారు. దీంతో అరెస్టు అయినవారి సంఖ్య 8కు చేరింది. అక్కిఆలూరుకు చెందిన మఫీద్ ఒణికేరి(23)ను మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. అత్యాచారం కేసు దాఖలైన వెంటనే అక్కిఆలూరు గ్యారేజి కార్మికుడు ఆఫ్తాబ్ చందనకట్టిను వ్యాపారి మదర్‌సాబ్ మండక్కి, ఆటో డ్రైవర్ అబ్దుల్‌ఖాదర్ జాఫర్‌సాబ్ హంచినమనిను అరెస్టు చేశారు. తాజాగా ఆదివారం ఇద్దరు, సోమవారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. కాగా అరెస్టు అయిన వారిలో మహమ్మద్ సైఫ్ ప్రమాదంలో గాయపడిన మేరకు హావేరి జిల్లాసుపత్రిలో చికిత్సలు పొందుతుండేవారు. ఉన్నతమైన చికిత్సల నిమిత్తం హుబ్బళి కిమ్స్ మెడికల్ కళాశాలకు పంపినట్లు వైద్యులు ప్రకటించారు.

సీఎం, డీసీఎంలను దూషించిన డ్రైవర్ అరెస్టు



అనిల్‌కుమార్

బెంగళూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో పేరు చేర్చుకునేందుకు సాధ్యం కాకపోవడంతో ఆగ్రహానికి లోనై సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లను దూషించేలా వీడియో విడుదల చేసిన దక్షిణకన్నడ జిల్లా మంగళూరుకు చెందిన డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఉత్తరకన్నడ జిల్లా అజ్జరణి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(34) అరెస్టు అయినవారు. ఇతడు 12 ఏళ్ళుగా సూరత్కల్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. క్యాబ్ డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిం చుకుంటున్నారు. రేషన్‌కార్డులో తన పేరును చేర్పించుకుని ప్రభుత్వ సంక్షేమాలను పొందే ప్రయత్నం చేశారు. మూడునెలలుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా సాధ్యం కావడం లేదు. తీవ్ర ఆగ్రహానికి లోనైన అనిల్‌కుమార్ ఓ వీడియోను చేసి మంగళవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తొలుత కన్నడలో దూషించి ఆ తర్వాత తుళు భాషలో అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్ఎస్‌యూఐ దక్షిణ కన్నడ జిల్లాధ్యక్షులు సుహాన్ అళ్వా నేరుగా మంగళూరు నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సూరత్కల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని బుధవారం అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శివశంకరప్ప (ఫైల్)

దొడ్డబళ్ళాపుర, జనవరి 17: పట్టణంలోని బసవభవన్ సమీపాన డైరీ వద్ద తుమకూరు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం రాత్రి సుమారు 1.30 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొంది. పట్టణంలోని రాజీవ్‌గాంధీ లే అవుట్ 2వ స్టేజ్ గంగాధరపుర నివాసి శివశంకరప్ప (54)గా గుర్తించారు. యలహంక హోటల్‌లో పనిచేస్తాడు. రేషన్‌కార్డుకు వేలి ముద్రలు ఇచ్చేందుకు యలహంక నుంచి దొడ్డబళ్ళాపురకు చేరుకున్నాడు. అంబేడ్కర్ కూడ లిలో బస్సు దిగి ఇంటికి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొన్నట్టు తెలుస్తోంది. ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఢిల్లీకి తరలిన జేడీఎస్ నేత కుమారస్వామి

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ కీలకనేత కుమారస్వామి ఢిల్లీ వెళ్ళారు. బీజేపీతో జేడీఎస్ పొత్తు కుదిరిన తర్వాత కుమారస్వామి ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంటోంది. కుమారస్వామి రెండురోజుల పాటు ఢిల్లీలోనే గడపనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో బీజేపీతో కలిసి జేడీఎస్ పోటీ చేసేలా ఇప్పటికే ఇరుపార్టీల ప్రముఖులు నిర్ణయించుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్రహోంమంత్రి అమిత్‌సింగ్‌లను కుమారస్వామి కలువనున్నారు. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా జేడీఎస్ పార్టీ కనీసం నాలుగు స్థానాలను కోరే అవకాశం ఉంది. వీటిలో మండ్య హాసన్, తుమకూరు, బెంగళూరు గ్రామీణ లేదా చిక్కబళ్ళాపుర స్థానాలను కోరే అవకాశం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి జేడీఎస్- కాంగ్రెస్‌తో మైత్రీ ప్రభుత్వం సాగిస్తున్న వేళ కలిసి పోటీ చేశారు. జేడీఎస్ జాతీయ అధ్యక్షులు దేవేగౌడ సహా అభ్యర్థులంతా ఓటమి చెందారు. హాసన్ నుంచి దేవేగౌడ మనవడు, రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ ఒక్కరు మాత్రమే గెలుపు సాధించారు. బీజేపీ ఏకంగా 25స్థానాలలో గెలుపు సాధించగా మండ్య నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపు సాధించిన సుమలత ప్రస్తుతం బీజేపీకు మద్దతు ఇస్తున్నారు.